# నవతరం

తెలుగు దినపత్రిక

RNI NO. APTEL/2014/58326

సంపుటి : -13 సంచిక : 94 ఎడిషన్ ఇన్‌ఛార్జ్ : నవచైతన్య శిరిగిరి

శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్నం రాజమండ్రి

05-02-2026 గురువారం వెల : 1/- పేజీలు : 4


## స్వదేశీ కే ప్రాధాన్యం.. ప్రపంచంలో మూడో స్థానం..

# ఇదే మా లక్ష్యం


**కేంద్ర పౌర విమానయాన శాఖా మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు**



**ఢిల్లీ:** ఢిల్లీలోని తన కార్యాలయంలో డ్రోన్ల పరిశోధన మరియు విడిభాగాల తయారీ పురోగతిని కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు సమీక్షించారు. ఈ సమీక్షలో డ్రోన్ R&D (రిసెర్చ్ అండ్ డెవలప్మెంట్), విడిభాగాల తయారీలో సాంకేతిక పురోగతి, సవాళ్లు, అవకాశాలపై వివరణాత్మక చర్చ జరిగింది. ఇదే సందర్భంలో పలు కీలక సూచనలను రామ్మోహన్ నాయుడు చేశారు. 2030 నాటికి ప్రపంచంలో మూడవ అతిపెద్ద డ్రోన్ మార్కెట్‌గా భారత్‌ను తయారు చేయాలనే లక్ష్యంతో స్వదేశీ డ్రోన్ తయారీకి ప్రత్యేక దృష్టి పెట్టినట్టు అయన స్పష్టం చేశారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పిలుపు మేరకు 'మేక్ ఇన్ ఇండియా' మిషన్ లో భాగంగా స్వదేశీ డ్రోన్ ఆవిష్కరణలకు, తయారీకి అందరూ కలిసి ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. స్వదేశీ డ్రోన్ సాంకేతికతలపై పెట్టుబడులు సులభతరం చేయడానికి మంత్రిత్వ శాఖలతో కలిసి ఇప్పటికే చర్యలు ప్రారంభించినట్లు తెలిపారు.

# పరిశ్రమల భద్రతపై రాజీ వద్దు

**జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్**



**నవతరం - శ్రీకాకుళం**

జిల్లాలోని రసాయన పరిశ్రమల్లో భద్రతా ప్రమాణాల అమలు రాజీవద్దని జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ కఠిన ఆదేశాలు జారీ చేశారు. బుధవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన 'జిల్లా సంక్షోభ నివారణ బృందం' సమావేశంలో ఆయన జూమ్ కాన్ఫరెన్స్ ద్వారా మాట్లాడుతూ.. పరిశ్రమల్లో ప్రమాదాల నివారణకు థర్డ్ పార్టీ సేఫ్టీ ఆడిట్ సిఫార్సులను యుద్ధప్రతిపాదికన అమలు చేయాలన్నారు.

పైడిభీమవరంలోని శ్రేయాస్ ఇండస్ట్రీస్‌లో ఉన్న మిథనాల్ నిల్వ సామర్థ్యాన్ని కమిటీ పరిశీలించాలన్నారు.

పరిశ్రమల్లో విష వాయువుల లీకేజీని గుర్తించేలా పొల్యూషన్ కంట్రోల్ బోర్డ్ నిరంతరం నిఘా ఉంచాలని, అత్యవసర సమయాల్లో స్పందించేందుకు వీలుగా ఆన్-సైట్ ఎమర్జెన్సీ ప్లాన్‌లను సిద్ధం చేయాలని కలెక్టర్ సూచించారు. పరిశ్రమల సమీప గ్రామాల ప్రజలకు, కార్మికులకు ప్రమాదాలపై అవగాహన కల్పించడంతో పాటు, ఎమర్జెన్సీ రెస్పాన్స్ టీమ్‌లకు జిల్లా అగ్నిమాపక అధికారి ఆధ్వర్యంలో శిక్షణ ఇవ్వాలని ఆదేశించారు.

ఈ సమావేశంలో విశాఖపట్నం ఫ్యాక్టరీల జాయింట్ చీఫ్ ఇన్‌స్పెక్టర్ జె.శివశంకర్ రెడ్డి, జిల్లా డిప్యూటీ చీఫ్ ఇన్‌స్పెక్టర్ బి.రాంబాబు, డీఐసీ జనరల్ మేనేజర్ రఘునాథ్ పాల్గొన్నారు.లాగే ఎన్‌డీఆర్‌ఎఫ్, ఎస్డీఆర్‌ఎఫ్ కమాండెంట్లతో పాటు అరోయాక్టివ్ ఫార్మా, శ్రేయాస్ ఇండస్ట్రీస్, డాక్టర్ రెడ్డీస్ ల్యాబ్స్, అప్టోరియా ఫార్మా వంటి ప్రధాన పరిశ్రమల ప్రతినిధులు, భద్రతా అధికారులు హాజరయ్యారు.

## ఆరోగ్యకరమైన జీవనశైలితో

# క్యాన్సర్‌ని జయించవచ్చు

- లయన్ డా. పైడి. సింధూర, డా. బమ్మిడి. సందీప్
- ఆర్ట్స్ కళాశాలలో కాన్సర్ పై అవగాహన సదస్సులు

2లో



# రెండు జెండా పండుగల్లో తేడా




**మాచన రఘునందన్**

ఎన్ఫోర్స్ మెంట్ డిప్యూటీ తాసిల్దార్

పౌర సరఫరాల శాఖ

తెలంగాణ ప్రభుత్వం

9441252121


చబ్బీస్ జనవరి అని ఉత్సాహంగా ఉత్సవంగా జరుపుకునే గణతంత్ర దినోత్సవం వచ్చేసింది కొద్ది సేపట్లో.. త్రి వర్ణం రెప రెపలాడనుంది.జెండా పండుగ ను గర్వంగా ఘనంగా జరుపుకుంటాం.

జణగణ మన అధినాయక.. జయహే..

భారత భాగ్య విధాత..

అని గొంతెత్తి,ముక్త కంఠంతో..

జాతీయ భావాన్ని,దేశ భక్తి నీ మన కంఠశోష గా త్రి వర్ణం రెపరెప ల కు సమున్నత గౌరవం తో సెల్యూట్ ..సమర్పిస్తాం

వీధి,వీధినా..అధికార..అనధికార పౌరుల సమక్షం లో..గణతంత్ర దినోత్సవం ఘనంగా జరుపుకుంటాం.

తల ఎత్తి..నుదుట అరచేత్తో సలాం.. చేస్తాశీ. మహోన్నత మువ్వన్నెల జెండాకు కు వందనం సగర్వంగా సమర్పిస్తాం.

త్రివర్ణ పతాకం కు .. జై హింద్

జై హింద్ అంటూ.. సమున్నత గౌరవ భావం తో.. జాతీయ గీతం ఆలకించి, ఆలపించి సెల్యూట్ చేస్తాం. ఐతే..

స్వతంత్ర దినోత్సవం నాడు జెండా ఎగరవేయడానికి, అలాగే జనవరి 26 నాడు జెండా ఆవిష్కరించడానికి తేడా ఏంటో తెలుసా..

ఆగస్టు 15, 1947న స్వేచ్ఛావాయువులు పీల్చుతూ భారతదేశం స్వాతంత్ర్యం పొందింది. అందుకే, ప్రతి ఏటా ఈ తేదీన స్వాతంత్ర్య దినోత్సవాన్ని జరుపుకుంటున్నాం. ఈ తేదీన దేశవ్యాప్తంగా జెండా ఎగురవేసి సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహిస్తారు. అలాగే 1950 జనవరి 26న దేశంలో రాజ్యాంగం అమలులోకి రాగా.. ప్రతి ఏటా ఈ తేదీని గణతంత్ర దినోత్సవంగా జరుపుకుంటాం. ఈ రోజున దేశవ్యాప్తంగా త్రివర్ణ పతాకాన్ని ఆవిష్కరించి ఘనంగా గణతంత్ర దినోత్సవాన్ని నిర్వహించుకుంటాం. ఆగస్టు 15న జెండా ఎగరవేయడానికి.. జనవరి 26న జెండా ఆవిష్కరించడానికి మధ్య చిన్న తేడా ఉంది.

### ఆ తేడా ఏమిటో తెలుసా?!

ప్రతి సంవత్సరం ఆగస్టు 15న దేశ ప్రధాని న్యూఢిల్లీలోని ఎర్రకోటలో జాతీయ జెండాను ఎగురవేస్తారు.

ఆగస్ట్ 15 రోజున, జాతీయ పతాకాన్ని స్తంభం దిగువన కడతారు

బ్రిటిష్ పాలన నుంచి భారతదేశం స్వాతంత్ర్యాన్ని పొందిందని సూచించడానికి త్రివర్ణ పతాకాన్ని పైకి లాగుతారు.లి మొదటి స్వాతంత్ర్య దినోత్సవం రోజున బ్రిటిష్ దేశ జెండాను దింపుతూ మన దేశ జెండాను పైకి ఎగురవేశారు. స్వాతంత్ర్యం వచ్చిందని తెలియజేయడానికి ఇలా త్రివర్ణ పతాకాన్ని పైకి లాగి ఎగురవేస్తారు. ఇది కొత్త దేశ ఆవిర్భావానికి ప్రతీకగా నిలుస్తుంది.

గణతంత్ర దినోత్సవం జనవరి 26 నాడు రాష్ట్రపతి జెండాను ఆవిష్కరిస్తారు. జనవరి 26న గణతంత్ర దినోత్సవం సందర్భంగా త్రివర్ణ పతాకాన్ని పైభాగంలో కట్టి, పైకి లాగకుండా విప్పుతారు. ఇలా త్రివర్ణ పతాకాన్ని ఆవిష్కరించడం ద్వారా ఇప్పటికే దేశం స్వతంత్రంగా ఉందని తెలియజేస్తారు. ఈ రెండు తేదీలలో జెండాను రెపరెపలాడిస్తారు.

( గమనిక: ఇక్కడ జనవరి 26 నాడు జెండాను అప్పటికే

-మిగతా 2లో

## ప్రపంచ క్యాన్సర్ దినోత్సవ

# అవగాహన ర్యాలీ.. జేమ్స్




**నవతరం - శ్రీకాకుళం**

ఒకప్పుడు క్యాన్సర్ అంటే మరణం తప్పదని.. క్యాన్సర్ పేరు వింటే బెంబేలు ఎత్తిపోయే పరిస్థితి ఉండేదని నేడు ఆ పరిస్థితి లేదని.. శ్రీకాకుళం శాసనసభ్యులు గొండు శంకర్ అన్నారు.. ప్రపంచ క్యాన్సర్ దినోత్సవము సందర్భంగా బుధవారం శ్రీకాకుళం నగరంలో జేమ్స్ మరియు కిమ్స్ హాస్పిటల్స్ సారధ్యంలో ఏర్పాటు చేసిన అవగాహన ర్యాలీ ను వైద్య ఆరోగ్య శాఖ అధికారులతో కలిసి ఎమ్మెల్యే ప్రారంభించారు.. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తొలిదశలో క్యాన్సర్ ను గుర్తిస్తే జయించడం సాధ్యం అన్నారు.. అందువల్ల ప్రతీ ఒక్కరూ విధిగా క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు చేసుకోవాలని సూచించారు. ప్రభుత్వ రిమ్స్ ఆస్పత్రిలో క్యాన్సర్ వ్యాధికి సంబంధించిన స్క్రీనింగ్ పరీక్షలు ఉచితంగా నిర్వహిస్తున్నారని.

గ్రామీణ ప్రాంతాల్లో కూడా సంచార వాహనాలు ద్వారా క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు చేస్తున్నారని వీటిని సద్వినియోగం చేసుకోవాలని ఆయన పిలుపు నిచ్చారు.. మారుతున్న కాలానికి అనుగుణంగా జింక్ ఫుడ్స్ తీసుకోవడం.. ఉభకాయం.. జన్యుపరంగా.. సరైన ఆహారం తీసుకోపోవడం వల్ల.

పొగాకు వినియోగం వల్ల .. క్యాన్సర్ వ్యాప్తి చెందుతుందని దీన్ని నియంత్రించవలసిన అవసరం ఎంతైనా ఉందని అన్నారు.. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు క్యాన్సర్ వ్యాధిని తరిమికొట్టేందుకు విశ్వప్రయత్నాలు చేస్తున్నారు అని .. ఎమ్మెల్యే స్పష్టం చేశారు.. ఈ కార్యక్రమంలో డి.ఎస్.పి సిహెచ్ వివేకానంద., డిఎం అండ్ హెచ్ఓ కె .అనిత, మున్సిపల్ కమిషనర్ కమలాకర్, జెంట్స్ హాస్పిటల్ భీమ్ లక్ష్మి లలిత, మెడికల్ డైరెక్టర్ ఏ . హేమంత్. జిఎం ప్రవీణ్, డిహెచ్ఎం విజయభాస్కర్, కిమ్స్ హాస్పిటల్ మెడికల్ డైరెక్టర్ జి. సోమేశ్వరరావు, సి ఓ ఓ రవిశంకర్, మరియు ఎన్జీవోస్, జేమ్స్ మరియు కిమ్స్ సిబ్బంది, జేమ్స్ కళాశాల విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు

## శ్రీకాకుళం పట్టణ పరిధిలో కొత్తరోడ్డు నుండి డే అండ్ నైట్ జంక్షన్ వరకు

# రోడ్డు విస్తరణ పనులు ప్రారంభం




**నవతరం - శ్రీకాకుళం**

కొత్త రోడ్డు జంక్షన్ నుండి డే అండ్ నైట్ జంక్షన్ వరకూ రోడ్డు విస్తరణ పనులు ఈ రోజు ప్రారంభం అయ్యాయి. ముందుగ్గ విస్తరణ కు అడ్డుగా ఉన్న ప్రహరీ గోడలు జే సి బి తో తొలగిస్తున్నారు. రోడ్డు విస్తరణ పనులు శర వేగంగా పూర్తి చెయ్యాలని స్థానిక ఎమ్మెల్యే గోండు శంకర్ ధృడ నిశ్చయముగా ఉన్నారు. పనులు పూర్తి చేయడానికి ప్రజలు, వార్తకులు స్వచ్ఛందంగా వచ్చి సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆర్ అండ్ బి అధికారులు, టీడీపీ పార్టీ నాయకులు పి ఎం జె బాబు, రెడ్డి గిరిజా శంకర్, చిట్టి నాగభూషణం,రెడ్డి సూర్యం,తంగి నరసింహ, కె వి ఎస్ నాయుడు బుజ్జి తదితరులు పాల్గొన్నారు.

ఎడిటోరియల్

# వీరుల స్మృతి జాతర!

ధిక్కార పతాకలైన వారి పేర జరిపే ఈ జాతరను బ్రాహ్మణీకరించాలని ప్రయత్నాలు జరిగాయి. జంతుబలులు, హలాలు విషయాలను చర్చకు తెచ్చారు. ఆదివాసులే పూజా కార్యక్రమాలు నిర్వహించేచోట బ్రాహ్మణ పూజారులను, పూజా పద్ధతులను తెచ్చే ప్రయత్నమూ చేశారు. సమ్మక్క, సారక్కలకు గద్దెలు తప్ప, గుడి గోపురాలేవీ లేవు. కట్టడాలు లేవు. పసుపు కుంకుమలు, ప్రసాదంగా బెల్లం తప్ప మరేదీ ఉండదు. ఇట్లాంటి ఒక గిరిజన తెగల సంప్రదాయాన్ని హైందవీకరించే ప్రయత్నం, ఆధిపత్య శక్తుల చొరబాటులను అడ్డుకోవాలి. దేశంలో భిన్నమైన సంస్కృతులు, సంప్రదాయాలు, ఆచారాలు ఉన్నాయనే విషయాన్ని నిరాకరించే మనువాదుల కుట్రలను తిప్పికొట్టాలి.

తెలంగాణలో జాతర అనగానే మేడారం మదిలోకొస్తుంది. సమ్మక్క సారక్కలు జ్ఞప్తిలోకి వస్తారు. శతాబ్దాలుగా జరుగుతున్న జనజాతర అది. అమరులైన ఆదివాసీ యోధుల స్మృతిలో ప్రణమిల్లే ప్రజా సమూహపు కలయిక. లక్షలాది ప్రజలు, మరీ ముఖ్యంగా ఆదివాసీలు ఎంతో ప్రేమతో, విశ్వాసంతో, భక్తితో మేడారం సమ్మక్క సారమ్మల గద్దెల వద్దకు చేరి, అమరవీరులకు వందనాలు చేయటం ఒక అపురూప ఘట్టం. ఆ మొక్కులను, భక్తిని, నమస్కారాలను పొందుతున్న సారక్కలు, సమ్మక్కలు, పగిడిద్దరాజు, జంపన్న, నాగులమ్మలు, బ్రహ్మ, విష్ణు అవతారాలేమీకాదు, పురాణగాథల పాత్రలూ కాదు, వాళ్లు చారిత్రక వ్యక్తులు. ఆదివాసీ నాయకులు.

తమ ప్రాంతంపైన, అటవీ సంపదపైన, ఆదివాసీ సమూహంపైన, తమ అధికారంపైన తమకే హక్కు ఉందని, మా రాజ్యాన్ని మేమే పాలించుకుంటామని ప్రకటించి, ప్రతిఘటించి, నాటి కాకతీయ రాజులు ప్రతాపరుద్రుడిపై యుద్ధం చేసి వీరమరణం పొందిన మన్యం వీరులు. అంతేకాదు, మాతృస్వామిక వ్యవస్థకు ప్రతిరూపాలుగా నిలిచిన సారక్క, సమ్మక్కలు వీరవనితలుగా వారి పేరుమీదనే ఈ మహాజాతర జరగడం మనం చూస్తున్నాము. కాకతీయ సామ్రాజ్యానికి వ్యతిరేకంగా పోరాటం చేయడమంటే సామాన్యమైన విషయం కాదు. సామంతుడుగా ఉన్న పగిడిద్దరాజు కరువుల కారణంగా కప్పం కట్టలేకపోయాడు. కప్పం ఎగ్గొట్టడంపై కళ్లెర్ర జేసిన ప్రతాపరుద్రుడు దాడికి పూనుకోగా, ప్రాణాలకు తెగించి పోరాడిన ఆదివాసీ ఆత్మగౌరవ ప్రతీకలైన పగిడిద్దరాజు, సమ్మక్క, సారమ్మ, జంపన్న, నాగులమ్మల జ్ఞాపకార్థం ప్రజలు జరుపుకునే జాతర ఇది.

ప్రపంచవ్యాపితంగా నేడు మనం చూస్తున్నాం. అమెరికా సామ్రాజ్యవాదం, మనపైనా, ఇతర దేశాలపైన దాడులు చేయటం లాంటి దుర్మార్గ చర్యలను. అయినా మన నాయకులు గానీ, ప్రపంచంలోని అనేక దేశాలు కానీ ఒక్కమాట కూడా వ్యతిరేకంగా మాట్లాడలేకపోతున్నవి. ఇది దుర్మార్గమని, నియంతృత్వమని కనీసం అనలేకపోతున్నవి. వీళ్లతో పోల్చితే సమ్మక్కసారక్కలు, పగిడిద్దరాజులు ఎంత ఆత్మాభిమానం కలవారో అర్థమవుతుంది. ఎంత వీరత్వం కలవారో కూడా అర్థమవుతుంది. జీఎస్టీ ద్వారా వచ్చిన సొమ్ము, రాష్ట్రాల వాటాను కూడా కేంద్రం ఇవ్వకపోతే నిలదీసి, అడిగే ధైర్యం రాష్ట్రాలు చేయలేకపోవటాన్ని కూడా గమనించ వచ్చు. సమ్మక్క సారక్కలను జాతరలో తలచుకోవడమంటే, వారు అందించిన స్ఫూర్తిని కొనసాగించడం కూడా అని నేటి నాయకులు తెలుసుకోవాలి. తెలంగాణ నేల ఇచ్చిన చైతన్యపూరిత పోరాట వారసత్వాన్ని పుణికి పుచ్చుకోవాలి. తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటం, చాకలి ఐలమ్మ, ఆరుట్ల కమలాదేవి, మల్లు స్వరాజ్యం మొదలైనవారు అలాంటి చైతన్యాన్ని కొనసాగించి వీరవనితలుగా పేరొందారు. ఇదీ వారసత్వపు కొనసాగింపు.

ఇక జాతర విషయానికొస్తే, 1946లో నైజాం పాలనలో సుబేదార్‌గా ఉన్న అమీర్ అలీఖాన్ పర్య వేక్షణలో మేడారం జాతర ఏర్పాట్లను ఘనంగా నిర్వహించారని చరిత్ర చెబుతున్నది. ధిక్కార పతాకలైన వారి పేర జరిపే ఈ జాతరను బ్రాహ్మణీకరించాలని ప్రయత్నాలు జరిగాయి. జంతుబలులు, హలాలు విషయాలను చర్చకు తెచ్చారు. ఆదివాసులే పూజా కార్యక్రమాలు నిర్వహించేచోట బ్రాహ్మణ పూజారులను, పూజా పద్ధతులను తెచ్చే ప్రయత్నమూ చేశారు. సమ్మక్క, సారక్కలకు గద్దెలు తప్ప, గుడి గోపురాలేవీ లేవు. కట్టడాలు లేవు. పసుపు కుంకుమలు, ప్రసాదంగా బెల్లం తప్ప మరేదీ ఉండదు. ఇట్లాంటి ఒక గిరిజన తెగల సంప్రదాయాన్ని హైందవీకరించే ప్రయత్నం, ఆధిపత్య శక్తుల చొరబాటులను అడ్డుకోవాలి. దేశంలో భిన్నమైన సంస్కృతులు, సంప్రదాయాలు, ఆచారాలు ఉన్నాయనే విషయాన్ని నిరాకరించే మనువాదుల కుట్రలను తిప్పికొట్టాలి.

ఒకవైపు మనదేశంలోని ఆదివాసీల హక్కులను, అడవిపై వారికున్న అధికారాన్ని కాలరాసే చట్టాలను, విధానాలను తీసుకువస్తున్న కేంద్ర పాలకులు, మరోవైపు వారి మతతత్వానికి పావులుగా ఆదివాసీలను వాడుకొనే ప్రయత్నం చేస్తున్నారు. కగార్ పేరిట ఆదివాసీలను అడవినుండి తరిమేసి కార్పొరేట్ శక్కులకు అటవీ సంపదను దోచి పెట్టేందుకు పూనుకుంటున్నారు. ఈ విషయాలనూ ఈ సందర్భంగా గుర్తుచేసుకుని అప్రమత్తమవ్వాలి. దేశంలో సాంస్కృతిక ఆధిపత్యం కోసం తీవ్రమైన ప్రయత్నం చేస్తున్న మనువాద పరివారం అనేక దుష్ప్రచారాలను, చరిత్రను చెరిపేయాలనీ కుట్రలు చేస్తున్నది. ఈ దాడులను ఎదుర్కోవాలంటే స్థానిక సాంస్కృతిక వారసత్వాలను కాపాడుకుంటూ, సామాన్యప్రజల పోరాట చైతన్యాన్ని పునికి పుచ్చుకుని ముందుకు పోవడం మన కర్తవ్యం. ఈ జాతరకు రోజురోజుకు ప్రజాదరణ పెరుగుతున్నదంటే, జనం బాధలు, వేదనలు, ఆశలు, ఆకాంక్షలు పెరిగాయని అర్థం. అందుకు ప్రజలను ఏకం చేసి పోరాడడమే ఏకైకమార్గం. అదే సమ్మక్క, సారక్కల స్ఫూర్తి.

# ఆరోగ్యకరమైన జీవనశైలితో క్యాన్సర్‌ని జయించవచ్చు

**నవతరం - శ్రీకాకుళం**

ఆరోగ్యకరమైన జీవనశైలితో క్యాన్సర్?ని జయించవచ్చని, ముందుగానే గుర్తిస్తే క్యాన్సర్? ప్రమాధకరం కాదని, లయన్ డా. పైడి. సింధూర అన్నారు. ప్రపంచ కాన్సర్ దినోత్సవం సందర్బంగా లయన్స్ క్లబ్ శ్రీకాకుళం సెంట్రల్, వైజాగ్ మెడికవర్ కాన్సర్ ఇన్స్టిట్యూట్, శ్రీకాకుళం సింధూర హాస్పిటల్ సంయుక్తంగా, స్థానిక ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్ డా.వై.పోలినాయుడు ఆధ్వర్యంలో అవగాహన సదస్సును నిర్వహించారు. ఇందులో భాగముగా లయన్స్ క్లబ్ అధ్యక్షురాలు పైడి. సింధూర, ఆంకాలజిస్ట్ డా. బమ్మిడి. సందీప్ లు స్క్రీనింగ్ పరీక్షలు చేసిన అనంతరం మాట్లాడుతూ కాన్సర్ పై సరైన అవగాహన లేక ఎందరో ప్రాణాలు పోగొట్టుకుంటున్నారని, ఆరోగ్యాకర జీవనసైలితో క్యాన్సర్? కేసులను నిరోధించవచ్చున్నారు. పోషకాహారం తీసుకోవాలని, బయటతినే ఆహారం, సింథటిక్ కలర్స్, క్యాన్సర్ కారకాలను పెంచుతుందని, తినే ఆహారంలో పండ్లు, కూరగాయలు, తృణధాన్యాలు, లీన్? ప్రోటీన్లతో ఆహారం ఉండేలా చూసుకోవాలని, ఇవి క్యాన్సర్ల నుంచి రక్షించడంలో సహాపడతాయాన్నారు. శరీరంలో ఏ భాగంలోనైనా ఎదుగుతున్న గడ్డలు, కణుతులు, అసహజమైన రక్తస్రావం, పెరుగుతున్న పుట్టుమచ్చలు, మింగటం కష్టంగా ఉండటం, గొంతు బొంగురుపోయి తగ్గకపోవడం వంటి లక్షణాలు ఉంటె, అశ్రద్ధ చెయ్యకుండా వైద్యులను సంప్రదించాలన్నారు. సర్వైకల్ క్యాన్సర్ వేక్సిన్ అందుబాటులో ఉందని, తొమ్మిది నుంచి పదహారు సంవత్సరాలు దాటిన వారు డోసులు వేసుకోవాలన్నారు. కళాశాల ప్రిన్సిపాల్ డా.వై.పోలినాయుడు, వైస్ ప్రిన్సిపాల్ డా.ఆర్. హరిత, డా. జి. రాజశేఖర్, డా. శశిభూషన్, డా. అరుణ కుమార్ లు మాట్లాడుతూ అవగాహనా సదస్సుని మా కళాశాలలో నిర్వహించడం ఆనందధాయకమని, ఊపిరితిత్తులు, గొంతు, నోటి క్యాన్సర్? కేసులు నమోదవుతున్నాయని, లివర్, బ్రెస్ట్, అన్నవాహిక క్యాన్సర్ల ప్రమాదం ఎక్కువగా ఉంటున్నాయాన్నారు. మెంబర్షిప్ జిల్లా చైర్మన్ నటుకుల. మోహన్, జిల్లా ఎన్విరాన్మెంట్ చైర్మన్ పొన్నాడ. రవికుమార్ మాట్లాడుతూ శరీరంలో మార్పులు వచ్చాయని అనుమానం వస్తే వెంటనే వైద్యున్ని సంప్రదించాలని, హెచ్పివి టీకాలు తీసుకుంటే గర్భాశయ, ఇతర క్యాన్సర్ల ప్రమాదాన్ని నివారించవచ్చని వైద్యులు తెలిపారన్నారు. అనంతరం సింధూర హాస్పిటల్ వైద్యులు వి. కాంచన, మెడికవర్ డ్యూటీ వైద్యులు సఫీరలు వైద్య శిబిరన్ని నిర్వహించారు. అవగాహన కార్యక్రమంలో సింధూర హాస్పిటల్ వైద్యులు వి. కాంచన, మెడికవర్ డ్యూటీ వైద్యులు సఫీర, లయన్స్ క్లబ్ శ్రీకాకుళం సెంట్రల్ కార్యదర్శి టెక్కం. రామ్ గోపాల్, ఉపాధ్యక్షులు ఉర్లం. శివతేజ, సీనియర్ సభ్యులు నారా. ఈశ్వర రావు, సభ్యులు చౌదరి. శ్రీనివాస్, కళాశాల అధ్యాపాకులు బెందాళం. వర లక్ష్మి, ఇతర అధ్యాపక బృందం విద్యార్థినిలు పాల్గొన్నారు.

# రెండు జెండా పండుగల్లో తేడా

మొదటిపేజీ తరువాయి

కర్ర/పోల్ కి పైన కట్టి ఉంచుతాము కనుక ఆగస్ట్ 15 లాగా జెండాను కింది నుండి పైకి లాగము.) దేశ పౌరుల ప్రతినిధి, భారత పార్లమెంటుకు ప్రజలచే నేరుగా ఎన్నికైన దేశ ప్రధాని స్వాతంత్ర్య దినోత్సవం రోజున జండా ఎగురవేయడానికి.. గణతంత్ర దినోత్సవం రోజున రాష్ట్రపతి జెండాను ఆవిష్కరించడానికి ఒక కారణం ఉంది.

స్వాతంత్ర్యం వచ్చిన సమయం నాటికి భారత రాజ్యాంగం అమలులోకి రాలేదు.

అప్పటికి రాజ్యాంగ అధిపతి అయిన రాష్ట్రపతి పదవి చేపట్టలేదు. దీంతో రాజ్యాంగం అమల్లోకి వచ్చిన జనవరి 26వ తేదీన రాజ్యాంగ అధిపతి అయిన రాష్ట్రపతి రిపబ్లిక్ డే నాడు మహోన్నత జెండాను ఆవిష్కరిస్తారు.

అయితే ఇక్కడ గమనించాల్సిన వ్యత్యాసం ఏమిటంటే..

స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా ప్రధానమంత్రి జెండాను ఎగురవేస్తారు (Flag Hoisting).

గణతంత్ర దినోత్సవం నాడు రాష్ట్రపతి జెండాను ఆవిష్కరిస్తారు (Flag Unfurling) .

ఇంకొక వ్యత్యాసం ఏమిటంటే .. స్వాతంత్ర్య, గణతంత్ర దినోత్సవ కార్యక్రమాల వేడుకలు రెండు వేర్వేరు ప్రదేశాల్లో జరుగుతాయి.

స్వాతంత్ర్య దినోత్సవం ఆగస్ట్ 15 నాడు జెండా ఎగురవేసే కార్యక్రమం ఎర్రకోటలో జరుగుతుంది.

గణతంత్ర దినోత్సవం జనవరి 26 నాడు రాజ్‌పథ్‌లో జెండా ఆవిష్కరణ కార్యక్రమం జరుగుతుంది.

ఈ విషయం ఇప్పటికీ చాలా మంది ఈ దేశ పౌరులకు తెలియదు.(చదువుకున్న వాళ్లకు కూడా చాలా వరకు తెలియదు).

జెండా పండుగ పై అవగాహన కల్పించడం మన బాధ్యత. ముఖ్యంగా విద్యార్దులకు తెలియాలి , తెనియజేయాలి

# ఎన్నెన్నో జన్మల బంధం భార్య భర్తల అనుబంధం




భార్య చిటికిన వేలును భర్త చిటికిన వేలుతో పట్టుకోమని బ్రహ్మ ముడి వేస్తారు ఎందుకో....? భార్య భర్తల బంధంలో ఒకరిని ఒకరు విడిచి ఉండకూడదు. ప్రయాణమైన పుణ్యక్షేత్రమైన-మోక్షమైన వనవాసమైన భార్య భర్తలు కలిసి వెళ్ళాలి-ఉండాలి. భార్య భర్తలుగా మారటం అంటే రెండు శరీరాలు ఒకే ప్రాణంగా మనుగడ సాగించటం.భార్యాభర్తల మధ్య గొడవలు జరిగిన ఎన్ని మనస్పర్థలు ఉన్న వాళ్ళిద్దరి మధ్య ఒక చిన్న ముడి.., అంటే వీళ్ళ మధ్య ఇంకొకరు దూరటానికి వీలు లేని విధంగా ఉండాలని, అలా ఉంచుకోవాలని గోరంత స్థలము ఏర్పడినా ఆ అదును చూసుకొని మూడో వ్యక్తి స్థలము ఏర్పరచుకుంటారని, ఏమి జరిగినా భర్తతోనే జీవితం అనుకోవాలని స్త్రీకి - భార్యే సర్వస్వంగా భావించాలని భర్తకి చెప్పి బ్రహ్మ ముడి వేస్తారు,"అంటే రెండు శరీరాలను ఒక ప్రాణంగా మార్చటం " శుభలేఖలకి నలువైపులా పసుపును ఎందుకు రాస్తారు? ఇది దేనికి సూచిక....!? మహాలక్ష్మిదేవికి, ఆమె అక్క జ్యేష్టదేవికి ఎవరెక్కడ ఉండాలన్న విషయమై చర్చ వచ్చింది. లక్ష్మీదేవి సముద్రంలోకి వెళ్లి దాక్కోవటంతో ఆమెని బయటికి రమ్మని జ్యేష్టాదేవి కోరింది. ఆ సమస్య కొలిక్కి వచ్చిన సమయంలో లక్ష్మీదేవి తానేక్క డ ఉంటుందో చెప్పింది. వాటిలో పసుపు ఒకటి. అందువల్లనే వివాహ శు భలేఖలకి, కొత్త వ్యాపార పుస్తకాలకు పసుపు రాసి శ్రీమహలక్ష్మికి ఆహ్వానం పలుకుతారు. ఆమెను ఆవిధంగా స్మరించుకోవడం వల్ల ఆమె కృప అన్నివేళలా వారిపై ఉంటుందని పురాణాలూ తెలియజేస్తున్నాయి.

మాంగల్య ధారణ అనంతరం అత్యంత కోలాహలంగా,ఇరువైపు బంధుమిత్రుల మధ్య పోటీలాగా జరిగే తంతు వధూ-వరులు "తలంబ్రాలు" పోసుకోవడం. ఎందుకంటే, వధూవరులుతో పాటు, బంధుమిత్రులకు కూడా చక్కటి వినోదాన్ని-ఆనందాన్ని కలిగించే కార్యక్రమం ఇది. మంగళ సూత్ర ధారణ పూర్తైన తరువాత తలంబ్రాల అక్షతలు తల మీదుగా పోసుకోవడం హిందూ సాంప్రదాయం. దీనిని అక్షతా రోహణం అని కూడా అంటారు కొందరు. 'క్షత' అంటే విరుగునది-'అక్షత' అంటే విరగనిది. అంటే, "వివాహ బంధం" విడదీయరాని బంధం కావాలని భావం. "తలన్ంబ్రాలు" అంటే తల నుండి క్రిందికి జారేవి అని కూడా అర్థం. అర్థాలు ఏవైనా, ఇదొక ఆనంద ప్రథమైన ఆచారం.

వధూవరుల గృహస్థా శ్రమ జీవితం శుభప్రదంగా, మంగళ ప్రదంగా వుండాలని "మంగళ ద్రవ్యాలతో" చేయించే పవిత్రమైన వైదికప్రక్రియఇది.పసుపు-బియ్యం-నెయ్యి-ఆవు పాలుఅనే మంగళ ద్రవ్యాలతో ఈ తంతు జరిపిస్తారు. కన్యను దానం చేస్తున్నానని పలికేవాడు అగ్ని. తథాస్తు అనే వాడు వాయువు. దంపతులు చాలా బాగున్నారని అనే వాడు చంద్రుడు. ఇవన్నీ నిజమే అని వంత పలికే వాడు-ఆనందించే వాడు సూర్యుడు. ఇవన్నీ అర్థం వచ్చే రీతిలో పురోహితుడు చెపుతున్న మంత్రాల మధ్య, వరుడి చేతితో కొబ్బరి చిప్పలో తీయించిన తలంబ్రాలు వధువు తలపైన మొదలు పోయిస్తారు. "నీవలన నాకు సంతానం అభివృద్ధి చెందుగాక" అని వరుడితో అనిపించుతారు. దానికి వధువు సమాధానం చెప్పకుండా, అంగీకార సూచకంగా, పురోహితుడు చెప్పిన పద్ధతిలో, వరుడి లాగనే తలంబ్రాలు తీసుకొని, వరుడి శిరస్సుపై పోస్తుంది. మొదటిసారి అలా పోస్తున్నప్పుడు, "పుట్టబోయే సంతానానికి పాల కొరకు" అన్న అర్థం వచ్చే రీతిలో, "నా పశు సంపద అభివృద్ధి చెందుగాక" అని వధువుతో అనిపించుతారు. దీనికి అంగీకార సూచకంగా వరుడు తలంబ్రాలు పోయాలి.

ఇలా మూడు పర్యాయాలు ఇలాంటి అర్థస్ఫూర్తిగల మంత్రాల చదువుతుంటే, వధూవరులు తలంబ్రాలు పోసుకుంటారు. చివరికి అదొక పోటీలాగా ఒకరి శిరస్సుపై మరొకరు పోసుకోవడం ఇటీవలి కాలంలో ఆచారంగా మారింది. తలంబ్రాల పళ్లెం ఎత్తి శిరస్సుపై కుమ్మరించడం కూడా పరిపాటై పోయింది. ఈ తంతు ముగిసిన తర్వాత, "బ్రహ్మ ముడి" వేడుక జరుగుతుంది. వధువు చీరె కొంగు అంచును, వరుడి ఉత్తరీయం అంచుకు కలిపి ముడివేస్తారు. బ్రాహ్మణుల ఆశీర్వచనాలను దంపతుల కొంగులలో ముడి వేయడం అనే భావన వుందిందులో. ఇకనుంచి, ఇరువురు కలిసి-మెలిసి అన్ని కార్యక్రమాలు నిర్వహించాలని, "ఇంటి యజమానురాలు"గా అన్ని బాధ్యతలు స్వీకరించి, నీ ఇంటిని నువ్వే చక్కదిద్దు కోవడానికి రమ్మని, వేద మంత్రాల ద్వారా వధువుని కోరుతాడు వరుడు వివాహం వల్ల భార్యా భర్తలు కలిసి మెలసి ఒకరికొకరు తోడుగా ఉండాలని సమాజం ఆశిస్తుంది.



వ్యాసకర్త
ఆధ్యాత్మిక సాహిత్య వ్యాసభూషణ్,
ఆధ్యాత్మక సాహిత్య సామ్రాట్
కావ్యసుధ,
హైదరాబాద్,
సెల్ 92473 13488

# అభివృద్ధిలో దూసుకెళ్తున్న పలాస..

**నవతరం - పలాస**



తండ్రి అడుగుజాడల్లో నడుస్తూ, ప్రజాసేవకే అంకితమైన పలాస శాసనసభ్యులు శ్రీమతి గౌతు శిరీష, నియోజకవర్గ అభివృద్ధి పనులకు పెద్దపీట వేస్తున్నారు. బుధవారం పలాస-కాశీబుగ్గ మున్సిపాలిటీలో ఆమె పర్యటించారు, లక్షలది రూపాయల విలువైన అభివృద్ధి కార్యక్రమాలకు శ్రీకారం చుట్టారు. ఈ పర్యటనలో భాగంగా, 4వ వార్డు రాజాం కాలనీలో ఎంపీ ల్యాడ్స్ నిధుల ద్వారా మంజూరైన నూతన సామాజిక భవనాన్ని ఆమె ప్రారంభించి ప్రజలకు అంకితం చేశారు. దీంతో పాటు, 17వ వార్డులో రూ. 20 లక్షల వ్యయంతో నిర్మించిన సీసీ రోడ్లను ప్రారంభించారు. అలాగే, 13వ వార్డులో రూ. 4 లక్షలు, 5వ వార్డులో రూ. 15 లక్షల విలువైన నూతన రోడ్ల నిర్మాణానికి శంకుస్థాపన చేశారు.

ఈ కార్యక్రమాలకు హాజరైన ఎమ్మెల్యే శిరీషకు స్థానిక మహిళలు హారతులు, నీరాజనాలతో బ్రహ్మరథం పట్టారు. "మీ తండ్రి, గౌరవనీయులు శ్రీ గౌతు శ్యామ్ సుందర్ శివాజీ గారి రాజకీయ వారసత్వాన్ని మీరు నిలబెట్టాలి. ఆయనలాగే మీరు కూడా ప్రజలకు అందుబాటులో ఉంటూ అభివృద్ధి చేస్తున్నారు. రాబోయే ఎన్నికల్లో మా ఓటు మీకే" అని వారు ముక్తకంఠంతో తమ మద్దతును ప్రకటించారు. ప్రజల అభిమానానికి చలించిపోయిన శ్రీమతి శిరీష, వారి నమ్మకాన్ని ఎప్పటికీ వమ్ము చేయనని, తన తండ్రి చూపిన మార్గంలోనే పయనించి పలాసను ఆదర్శ నియోజకవర్గంగా తీర్చిదిద్దుతానని హామీ ఇచ్చారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నిధులను సమన్వయం చేసుకుంటూ అభివృద్ధిని పరుగులు పెట్టిస్తానని ఆమె పేర్కొన్నారు. ఆమెతోపాటు రాష్ట్ర ఏపీటీపిసి చైర్మన్ శ్రీ వజ్జ బాబురావు గారు, పలాస కాశీబుగ్గ మున్సిపాలిటీ చైర్మన్ బల్ల గిరిబాబు గారు, మున్సిపాలిటీ ముఖ్య నాయకులు, కార్యకర్తలు, ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

# క్యాన్సరును జయిద్దాం

యూనియన్ ఫర్ ఇంటర్నేషనల్ క్యాన్సర్ కంట్రోల్ ప్రతి సంవత్సరం క్యాన్సర్ దినోత్సవాన్ని జరుపుకుంటుంది. వ్యాధి గురించి మరియు దానిని ఎలా నివారించాలో ప్రజలకు అవగాహన కల్పించడం దీని ఉద్దేశ్యం. ఈ దినోత్సవాన్ని ఫిబ్రవరి 4, 1933న తొలిసారి జరుపుకున్నారు. యూ ఐ సి సి కొన్ని ఇతర ప్రధాన క్యాన్సర్ సంస్థలు, చికిత్సా కేంద్రాలు, పరిశోధనా సంస్థలు మరియు రోగుల సమూహాల మద్దతుతో ఈ రోజును నిర్వహిస్తుంది.

కేన్సర్‌కు కారణాల్లో ఆధునిక జీవన శైలి ప్రధానమైంది. మద్యం, పొగతాగడం, ఆహారపదార్థాల్లో రంగులు వినియోగం, రసాయనాలు వాడటం, హార్మోన్లు అధికంగా వాడటం, అధిక బరువు, కాలుష్యం, క్రిమిసంహారకాలు, చికిత్సలో భాగంగా లేదా ప్రమాదవశాత్తు రేడియేషన్‌కు గురికావడం, తరచూ వేధించే ఇన్ఫెక్షన్లు.. ఇవన్నీ క్యాన్సర్‌కు కారకాలు. కొన్ని రకాల కేన్సర్లను రాకుండా వ్యాక్సిన్ వేసుకోవచ్చు. వాటిలో గర్భాశయ ముఖద్వార క్యాన్సర్‌కు ప్రధాన కారణం హెచ్‌పీవీ వైరస్. కాబట్టి దీనికి వ్యాక్సిన్ వేసుకుని నివారించవచ్చు. 9 ఏళ్లు పైబడిన బాలికల నుంచి 40 ఏళ్ల మహిళల వరకు ఈ వ్యాక్సిన్ వేయించుకోవచ్చు. అలాగే అండాశయం, గొంతు క్యాన్సర్ రాకుండా కూడా ఇది అడ్డుకుంటుంది. క్యాన్సర్ కణం శరీరంలో ఎక్కడుందనే విషయం తెలుసుకోవడం కష్టం. ఏ అవయవానికి సోకిందనే అనుమానం ఉంటే దానికి సంబంధించిన పరీక్షలు వేర్వేరుగా ఉంటాయి. వీటిలో బయాప్సీ, యఫ్‌యన్‌ఏ టెస్ట్, బ్లడ్ మార్కర్స్, ఎక్స్-రే, సీటీ స్కాన్, యంఆర్ఐ, పీఈటీ స్కాన్ వంటివి అవసరాన్ని బట్టి చేస్తారు. అయితే సర్వైకల్ క్యాన్సర్‌ను పాప్‌స్మియర్ ద్వారా ముందుగా గుర్తించవచ్చు.

కేన్సర్ చికిత్సను కూడా వయస్సును బట్టి నిర్ధరిస్తారు. క్యాన్సర్ కణాలను నిర్వీర్యం చేయడానికి కీమోథెరఫీ, రేడియోథెరఫీలతో పాటు ల్యాప్రోస్కోపిక్ పద్ధతిలో చేసే కీహోల్ సర్జరీలు కూడా నేడు అందుబాటులో ఉన్నాయి. సర్జరీ తర్వాత రేడియో, కీమో, హార్మోన్ థెరఫీ లాంటివి చేసినా, లేక థెరఫీల తర్వాత సర్జరీ చేసినా చికిత్స అంతటితో అయిపోయిందని భావించరాదు. క్రమం తప్పకుండా వైద్య పరీక్షలు చేయించుకోవాలి. శరీరంలో ఏదైనా అవయవానికి కేన్సర్ సోకితే తొలిదశలో లక్షణాలు అంతగా కనిపించవు. వ్యాధి సోకిన అవయవాన్ని బట్టి దీని నిర్ధరణ పరీక్షలు కూడా వేర్వేరుగా ఉంటాయి. కొన్ని రకాల క్యాన్సర్లనూ ఒకే విధమైన పరీక్షతో తెలుసుకోవడం సాధ్యం కాదు. క్యాన్సర్ అంటువ్యాధికాదు. అలాగే వంశపారంపర్యంగా వచ్చే అవకాశం కూడా తక్కువే. అయితే, రొమ్ము, థైరాయిడ్, పెద్దపేగు, పాంక్రియాస్ క్యాన్సర్లు జన్యుపరంగా సంక్రమిస్తాయి. కుటుంబంలో ఎవరికైనా ఈ కేన్సర్లు వస్తే వచ్చే ప్రమాదం ఉంది. క్యాన్సర్‌ను తొలి దశలో గుర్తించకపోతే ఇతర భాగాలకూ వ్యాపించి, చికిత్సకు సైతం ఏమాత్రం తగ్గుముఖం పట్టవు. కాబట్టి దీనిపై అవగాహనతో ఎదుర్కొవాలి.

ప్రపంచ క్యాన్సర్ దినోత్సవం యొక్క ఆచారం క్యాన్సర్ కలిగి ఉన్న ప్రపంచ ప్రభావాన్ని తగ్గించడం మరియు వ్యక్తిగత, సామూహిక మరియు ప్రభుత్వ చర్యలను ఉత్ప్రేరకపరచడం ద్వారా క్యాన్సర్ రోగులకు మరియు ప్రాణాలతో బయటపడిన వారికి సహాయాన్ని అందించడం చుట్టూ కేంద్రీకృతమై ఉంది. ప్రపంచ క్యాన్సర్ దినోత్సవం క్యాన్సర్ గురించి తప్పుడు సమాచారం మరియు కళంకాన్ని కూడా లక్ష్యంగా చేసుకుంటుంది.

ప్రపంచ క్యాన్సర్ దినోత్సవం 2026 ఫిబ్రవరి 4న, "యునైటెడ్ బై యూనిక్" అనే థీమ్‌తోనిర్వహించబడుతుంది. 2020నాటికి దేశంలో సుమారు 12లక్షల మంది కాన్సర్ బాధితులు ఉండగా, ఈ సంఖ్య 2025నాటికి 15లక్షలు దాటింది. పురుషులలో ఎక్కువగా లంగ్ కాన్సర్, స్త్రీలలో ఎక్కువగా బ్రెస్ట్ కాన్సర్ వస్తున్నట్టు వివిధ అధ్యాయనాలు తెలుపుతున్నాయి.

2025లో భారతదేశంలో అత్యధిక కాన్సర్ కేసులు నమోదు అయ్యాయని ప్రముఖ అంకాలజిస్ట్ నోరి దత్తాత్రేయుడు తెలిపారు. రోజురోజుకు పెరుగుతున్న కాలుష్యం కూడా ఇందుకు ప్రధాన కారణం కావచ్చని ఆయన తెలిపారు.అమెరికాలో మాదిరిగానే ఇండియా వంటి దేశాల్లో కాన్సర్ ను గుర్తించదగ్గ రోగంగా పరిగణించాలని ఆయన సూచించారు. దేశంలో రొమ్ము, నోటి, గర్భాశయ, ఊపిరితిత్తులు, కడుపు మరియు కొలొరెక్టల్ క్యాన్సర్‌లు అత్యంత సాధారణమైన క్యాన్సర్‌లుగా ఉన్నాయి.. ఈ వ్యాధి ఏ వయసు వారికైనా రావచ్చు. అవగాహనతోనే ఈ వ్యాధిని అరికట్టేందుకు కృషి చేయాలని వైద్య ఆరోగ్య నిపుణులు సూచిస్తున్నారు.అదే విధంగా కాన్సర్ ను తొలి దశలో గుర్తిస్తే, చాలా వరకు నయం చేయవచ్చని వైద్య ఆరోగ్య నిపుణులు చెబుతున్నారు. కాన్సర్ నియంత్రణ మందుల ధరలను కేంద్రం తగ్గించింది. అదే విధంగా ఈ ఏడాది నుండి జిల్లా కేంద్రాల్లో కూడా కాన్సర్ నిర్ధారణ, నివారణ చర్యలకు వివిధ ఆసుపత్రులను ఏర్పాటు చేస్తామని కేంద్రం తెలిపింది. పేదరికం కాన్సర్ రోగుల పట్ల ఒక శాపంగా మారింది.పౌష్టికాహారం తీసుకోవడం కాన్సర్ నియంత్రణకు చాలా అవసరం. ఇందుకు ప్రభుత్వాలు తగు చర్యలు తీసుకోవాలి.



యం.రాం ప్రదీప్

# గురువంటే ఆరని ఒక జ్ఞానదీపం..!

గురువంటే..?
అజ్ఞానపు చీకటిని
చీల్చే ప్రచండ సూర్యుడు...
శిష్యుల భవిష్యత్తును
అందంగా చెక్కే
ఒక అపూర్వశిల్పి...

గురువంటే..?
విజయ దర్పణంలో
మెరిసే నిత్య ప్రతిబింబం
గుండె లోగిళ్లలో
వెలిగే అఖండ జ్ఞానదీపం...

గురువంటే..?
అజ్ఞానపు
సుడిగుండంలో
కాపాడే వజ్ర కవచం...
శాంతి సముద్రాన
దారిచూపే స్థిర
దీపస్తంభం...

గురువంటే..?
గెలుపు గుర్రంపై
మ్రోగే జయ విజయభేరి...
శిష్యుడి శిరస్సుపై
మెరిసే కోహినూరు వజ్రం...

గురువంటే..?
జీవిత పయనంలో
వెన్నంటి నిలిచే
ఊతకర్ర...
కష్టాల గాయాల్ని
మాన్పే
దివ్యమైన
మత్తుమందు...

గురువంటే..?
అంధకారపు దారిలో
వెలుగులీనే
కాంతికిరణం...
శ్రమజీవి చెమట
చుక్కల్లో విరిసిన
మందహాసం...

గురువంటే..?
జ్ఞానామృతాన్ని
కురిపించే అమృత
మేఘం...
అజ్ఞానాన్ని తుంచే
వజ్రాయుధం...
విజయాలను
మోసుకొచ్చే చైత్ర
వసంతం...

అట్టి గురుదేవులకు
చేద్దాం...
గురుదక్షిణగా...
శిరసులువంచి వారి
పాదాలకు పాలాభిషేకం.
పుష్పాభిషేకం...





కవి రత్న సాహిత్య ధీర,
సహస్ర కవి భూషణ్,
**పోలయ్య కూకట్లపల్లి,**
అత్తాపూర్, హైదరాబాద్



# కేరళకుట్టికి మంటెత్తితే ఇంతే మరి!

అనస్వర రాజన్..ఓ కేరళకుట్టి. మలయాళ మిస్టరీ క్రైమ్ థ్రిల్లర్ -రేఖా చిత్రం-తో పాపులర్ అయిన ఈ మలయాళ సోయగం -ఛాంపియన్-తో తెలుగులోనూ ఎంట్రీ ఇవ్వడం తెలిసిందే. ప్రస్తుతం -టూరిస్ట్ ఫ్యామిలీ- డైరెక్టర్ అభిషన్ జీవింత్ హీరోగా పరిచయం అవుతున్న రొమాంటిక్ లవ్ స్టోరీ -విత్ లవ్-తో మరోసారి ప్రేక్షకుల ముందుకు రాబోతోంది. మరో ఇద్దరు ప్రొడ్యూసర్స్‌తో కలిసి రజనీకాంత్ కుమార్తె సౌందర్య రజనీకాంత్ ఈ మూవీని నిర్మిస్తోంది. ఇప్పటికే ప్రమోషన్స్ ప్రారంభించిన టీమ్ ఈ మూవీని ఫిబ్రవరి 6న తమిళంతో పాటు తెలుగులోనూ రిలీజ్ చేస్తున్నారు.

మలయాళ, తమిళ, తెలుగు భాషల్లో అనస్వరకు ఏర్పడిన క్రేజ్‌కు తగ్గట్టుగా ఈ మూవీ ప్రమోషన్స్‌ని టీమ్ భారీగానే ప్లాన్ చేసింది. డ్రోన్ షోతో ఫస్ట్ టైమ్ తమిళ ఇండస్ట్రీలో సరికొత్త ప్రయోషన్స్‌కు తెరలేపింది. ఇప్పటికే తమిళనాట ప్రమోషన్స్‌ని ఓ రేంజ్‌లో టీమ్ మొదలు పెట్టింది. అయితే ఓ తమిళ మీడియా చేసిన అతి కేరళ కుట్టి అనస్వరకు చిరాకు తెప్పించిందట. ఈ మూవీ ప్రమోషన్స్‌లో భాగంగా ఇటీవల అనస్వర ఓ తమిళ పత్రికకు ఇంటర్వ్యూ ఇచ్చిందట. అయితే అందులో తను మాట్లాడిన మాటలకు మరో వాక్యాన్ని జోడించి దాన్నే హైలైట్ చేస్తూ టైటిల్ పెట్టి పబ్లిష్ చేశారట.

అదే అనస్వరకు చిరాకు తెప్పించిందని తెలుస్తోంది. తన మాటలను తప్పుదోవ పట్టించే విధంగా తాను మాట్లాడిన మాటలని సదరు పత్రిక వారు వక్రీకరించారని అనస్వర మండిపడింది. సోషల్ మీడియా వేదికగా తన ఆగ్రహాన్ని వ్యక్తం చేసింది. -దీనిని రూపొందించన వారికి నిజంగా హ్యాట్సాఫ్ చెప్పాలి. తేలికపాటి సంభాషణలు, నవ్వులతో నిండిన పూర్తి 20 నిమిషాల తమిళ ఇంటర్వ్యూను ఓపికగా కూర్చుని చూసి అందరూ నవ్వుతున్నప్పుడు సరదాగా చెప్పిన ఒకే ఒక వ్యాఖ్యాన్ని పట్టుకుని దాన్ని ఏదో తీవ్రమైన ప్రకటనగా పోర్ట్రే చేయడానికి చాలా ఓపిక కావాలి. అది జర్నలిజం కాదు. అది కేవలం కొన్ని వాఖ్యాలను ఏరుకోవడం చెప్పిన సందర్భాన్ని వక్రీకరించడం..లేని చోట ప్రతికూలతను వివాదాన్ని సృష్టించడం. ఒక జోక్‌ను అతిగా ప్రచారం చేయడం మిమ్మల్ని తెలివైన వారిగా చూపించదు. అది కేవలం మీరు ప్రచారం కోసం ఎంతగా ఉబలాటపడుతున్నారో చూపిస్తుంది- అంటూ ఫైర్ అయింది. ఇటీవల కొన్ని విమర్శలకు స్పందించకూడదని ఓ గీత గీసుకున్నాను. కానీ నా వ్యక్తిగత హననం జరుగుతున్నప్పుడు వెంటనే దానిపై స్పందించాలనుకున్నాను. అందుకే స్పందించాను- అని తెలిపింది అనస్వర.

ఇదిలా ఉంటే -విత్ లవ్- తరువాత అనస్వర రాజన్ మరో క్రేజీ సీక్వెల్‌తో ప్రేక్షకుల్ని సర్‌ప్రైజ్ చేయబోతోంది. తను నటిస్తున్న రొమాంటిక్ లవ్ డ్రామా -7/జి రెయిన్‌బో కాలనీ 2-. సెల్వరాఘవన్ డైరెక్టర్. 2004లో రవికృష్ణ, సోనియా అగర్వాల్ జంటగా నటించిన -7/జి రెయిన్‌బో కాలనీ-కి సీక్వెల్ ఇది. తమిళ, తెలుగు భాషల్లో సంచలన విజయాన్ని సొంతం చేసుకున్న ఈ సినిమా సీక్వెల్ తమిళంతో పాటు తెలుగులోనూ రిలీజ్ కానుంది. ప్రస్తుతం చిత్రీకరణ చివరి దశకు చేరుకుంది. త్వరలో ఈ మూవీకి సంబంధించిన కీలక అప్ డేట్‌ని మేకర్స్ రిలీజ్ చేసే అవకాశం ఉందని తెలిసింది.

# వాయిదాల పర్వంలోకి మరో 2 సినిమాలు

ఇప్పటికే ది ప్యారడైజ్ వాయిదా పడింది. పెద్ది పోస్ట్ పోన్ అయింది. స్వయంభూ వాయిదా బాట పట్టింది. ఇప్పుడీ లిస్ట్‌లోకి మరో 2 సినిమాలు చేరేలా ఉన్నాయి. అవే డెకాయిట్, ఉస్తాద్ భగత్‌సింగ్.

అడివి శేష్ హీరోగా నటిస్తున్న డెకాయిట్ సినిమా లెక్కప్రకారం మార్చి 19న విడుదలవ్వాలి. కానీ ఇప్పుడా సినిమా వాయిదా పడింది. కొత్త విడుదల తేదీని త్వరలోనే ప్రకటిస్తారు.

డెకాయిట్‌ను ఒకేసారి తెలుగు-హిందీ భాషల్లో పిక్చరైజ్ చేశారు. అదే విధంగా ఒకేసారి విడుదలకు ప్లాన్ చేశారు. ఆరు నూరైనా డేట్ మారదంటూ ఆమధ్య శేష్ ప్రకటించాడు. ఎప్పుడైతే ధురంధర్-2 విడుదల తేదీ ప్రకటించారో, ఇక డెకాయిట్‌ను వాయిదా వేయక తప్పని పరిస్థితి. ఇప్పటికే ఈ సినిమా పలుమార్లు వాయిదాపడింది. ఇప్పుడు మరోసారి.

ఇక వాయిదాల లిస్ట్‌లో ఉన్న మరో సినిమా ఉస్తాద్ భగత్‌సింగ్. పవన్ కల్యాణ్ హీరోగా నటించిన ఈ సినిమాను మార్చిలో విడుదల చేయాలనుకున్నారు. కానీ ఇప్పుడు ఏప్రిల్‌కు వాయిదా వేసే ఆలోచనలో ఉన్నారు. ధురంధర్-2తో పోటీ పడకుండా ఉండడంతో పాటు, పోస్టు ప్రొడక్షన్‌కు ఇంకాస్త టైమ్ తీసుకోవాలని యూనిట్ భావిస్తోంది.

ఇలా టాలీవుడ్‌లో వాయిదాల లిస్ట్ రోజురోజుకు పెరుగుతూనే ఉంది. రాబోయే రోజుల్లో ఈ జాబితాలోకి ఇంకెన్ని సినిమాలు చేరుతాయో చూడాలి. అన్నట్టు మార్చిలో రావాల్సిన టాక్సిక్ కూడా వాయిదాపడింది.





# విద్యార్థులు నేత్ర సమస్యలపై తప్పనిసరిగా అవగాహన కలిగి ఉండాలి....

## ఎమ్మెల్యే గొండు శంకర్



**నవతరం-శ్రీకాకుళం**

ప్రతి విద్యార్థి పాఠశాల దశలోనే కంటి సమస్యలపై అవగాహన కలిగి ఉండాలని అందువలన ఏదైనా సమస్య ఉన్నట్లయితే ముందుగానే గుర్తించి సరి చేయవచ్చని ఎమ్మెల్యే గొండు శంకర్ అన్నారు. శ్రీకాకుళం పట్టణంలో ఎన్టీఆర్ మున్సిపల్ హై స్కూల్ ఆవరణలో జిల్లా అంధత్వ నివారణ సంస్థ ఆధ్వర్యంలో "పాఠశాల విద్యార్థులకు ఉచిత కళ్లద్దాల పంపిణీ" కార్యక్రమం ప్రారంభ కార్యక్రమం లో ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. విద్యార్థులు చదువులో వెనుక బడకుండా ఉండాలంటే కంటి చూపు ప్రధానమన్నారు .ప్రభుత్వం అందిస్తున్న ఈ ఉచిత కంటి వైద్య సదుపాయాన్ని ప్రతి విద్యార్థి సద్వినియోగం చేసుకోవాలని కోరారు. జిల్లా వ్యాప్తంగా నిర్వహించిన "పాఠశాల విద్యార్థుల కంటి పరీక్షా కార్యక్రమం "వివరాలను జిల్లా అందత్వ నివారణ సంస్థ ప్రోగ్రాం మేనేజర్ డా.ఎస్ పుష్పలత వివరించారు. జిల్లాలో 30 మండలాల్లో 18 మంది ఆప్తాలమిక్ అధికారులతో ముందుగా 1082 మంది ఉపాధ్యాయులకు శిక్షణ ఇవ్వడం జరిగిందని 6 నుంచి 18 ఏళ్ల లోపు 108207 మంది విద్యార్థులకు పరీక్షలు నిర్వహించి 5595 మందికి దృష్టిలో ఉన్నట్లు గుర్తించడం జరిగిందని వారిలో 5550 మందికి ఉచిత కళ్లద్దాలు ఏర్పాటు చేయడం జరిగిందన్నారు.

కార్యక్రమంలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డా . కె.అనిత మాట్లాడుతూ దృష్టిలోపం గుర్తించిన ప్రతి విద్యార్థికి ఈ నెలాఖరు లోపల ఉచిత కళ్లద్దాలు పంపిణీ పూర్తి చేస్తామని అలాగే విద్యార్థులు కూడా కంటి అద్దాలను ప్రతినిత్యం ధరించి ఏడాదికి ఒకసారి కంటి పరీక్షలు చేసుకోవాలని మొబైల్ కి దూరంగా ఉండి సరైన వెలుతురులో చదవడం వ్రాయడం చేయాలన్నారు.అలాగే తీవ్ర కంటి సమస్యలు గుర్తించిన 11 మంది విద్యార్థులకు ఎన్టీఆర్ వైద్య సేవ ద్వారా ఉచితంగా చికిత్సలు అందిస్తామన్నారు. కార్యక్రమంలో పాఠశాల విద్యార్థుల కంటి పరీక్ష కార్యక్రమంలో ఉత్తమ సేవలు అందించిన ఆప్తాలమిక్ అధికారులు ఎం ఆర్ కే దాస్, ఎన్ రంగారావు, ఎం బాబురావు ,వి చంద్రశేఖర రావులకు ముఖ్య అతిథి ఎమ్మెల్యే గొండుశంకర్ గారి చేతుల మీదుగా ఎప్రిసియేషన్ సర్టిఫికెట్స్ అందజేశారు. కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖ ఏడి శ్రీనివాసరావు, మండల విద్యాశాఖ అధికారులు డా. సుజాత ,ఎస్ కృష్ణ , పట్టణ ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డా.ప్రత్యూష ప్రధానోపాధ్యాయులు డి ఎస్ వి భరద్వాజ్, ఉపాధ్యాయులు, విద్యార్థులు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

# భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డు పునరుద్ధరించాలి

## ఫిబ్రవరి 12 దేశవ్యాప్త సమ్మెలో పాల్గొంటాం : సీఐటీయూ



**నవతరం-కొత్తూరు**

భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డును వెంటనే పునరుద్ధరించి, కార్మికులకు సంక్షేమ పథకాలు అమలు చేయాలని సీఐటీయూ కన్వీనర్ పనస రమేష్ డిమాండ్ చేశారు. ఈ నెల 12వ తేదీన జరిగే దేశవ్యాప్త కార్మిక సమ్మెలో భవన నిర్మాణ కార్మికులు పెద్ద ఎత్తున పాల్గొంటారని ఆయన తెలిపారు.

ఈ సందర్భంగా కొత్తూరు మండల కేంద్రంలో భవన నిర్మాణ కార్మిక సంఘం (సీఐటీయూ) సమావేశం నిర్వహించారు. సమావేశంలో కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన లేబర్ కోడ్లను రద్దు చేయాలని కోరుతూ ఫిబ్రవరి 12 - దేశవ్యాప్త సమ్మె ? పుస్తకాన్ని ఆవిష్కరించారు.

నేతలు మాట్లాడుతూ గతంలో నిర్మాణ కార్మికులకు అందించిన అనేక సంక్షేమ పథకాలను నిలిపివేశారని, పెండింగ్‌లో ఉన్న క్లెయిమ్‌లు ఇప్పటికీ మంజూరు కావడం లేదని విమర్శించారు. కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన లేబర్ కోడ్ల వల్ల పని గంటలు పెరుగుతున్నాయని, భద్రత లేకుండా కార్మికులు పనిచేయాల్సిన పరిస్థితి ఏర్పడిందన్నారు. అందుకే లేబర్ కోడ్ల రద్దు, సంక్షేమ బోర్డు పునరుద్ధరణ కోసం సమ్మెలో పాల్గొంటున్నామని తెలిపారు.

మరోవైపు గ్రామీణ ఉపాధి హామీ పథకాన్ని కూడా నీరుగార్చిన కేంద్ర బీజేపీ ప్రభుత్వాన్ని కార్మికులు, ప్రజలు వ్యతిరేకిస్తున్నారని చెప్పారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ప్రజలకు అబద్ధపు ప్రచారాలు చేస్తూ అణిచివేత చర్యలకు పాల్పడుతోందని ఆరోపించారు. ఈ నేపథ్యంలో ఫిబ్రవరి 12న అన్ని పనులు బంద్ చేసి సమ్మెలో పాల్గొనాలని నిర్ణయించినట్లు వెల్లడించారు.

ఈ కార్యక్రమంలో భవన నిర్మాణ కార్మిక సంఘం నాయకులు జి. సత్యం, యల్. వెంకటరావు, జి. సూర్యనారాయణ, యస్. కృష్ణ, డి. చిన్నారావు, జి. రాజు, టి. ప్రసాద్, పి. సూర్యనారాయణ, బి. రామారావు, డి. కృష్ణప్రసాద్, వి. ఆనంద్, బాలరాజు తదితరులు పాల్గొన్నారు.

# పూర్వ విద్యార్థుల ఆత్మీయ సంగమం

**నవతరం-శ్రీకాకుళం రూరల్**



సింగుపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 1977-78 పదవ తరగతి చదువుకున్న పూర్వ విద్యార్థుల ఆత్మీయ సంగమం మంగళవారం ఒక ఫంక్షన్ హాల్ లో జరిగింది. చిన్ననాటి జ్ఞాపకాలను గుర్తుచేసుకుంటూ , యోగ క్షేమాలు తెలిపుతూ, ఉదయం నుండి సాయంత్రం వరకు వయసు మరచి ఆట పాటలతో సందడి చేశారు. ముఖ్య అతిథులుగా అనుఫోజు బాబూరావు, విశ్రాంత ఎస్ ఐ వెంకటరావు, ఎన్ శాంతరావు పాల్గొన్నారు.సినీ మధురగీతాలు, సి హెచ్ రాజారావు,ఎ నాగేశ్వరరావుల పౌరాణిక పద్యాలు, శైలజ అన్నమయ్య కీర్తనలు తో పాటు మాధవరావు, కృష్ణమూర్తి లు నిర్వహించిన వేర్వేరు కృత్యాలతో అందరూ ఆనందోత్సాహాలతో గడిపారు . చివరిగా వారు చదువుకున్న పాఠశాలకు వెళ్లి ప్రధానోపాధ్యాయులు భారతిని కలసి పాఠశాల అభివృద్ధికి నగదు బహుమతి అందజేశారు. తరచూ తాము కలవాలని, తమ స్నేహం ఎప్పటికీ ఇలానే కొనసాగాలని కోరుకుంటూ ఒకరికొకరు వీడ్కోలు చెప్పుకున్నారు.

# గ్రంథాలయాలకు పూర్వవైభవం తెస్తాం

- పీరుకట్ల విఠల్ రావు
- రూ. 6 కోట్లతో అభివృద్ధి ప్రణాళికలు సిద్ధం

**నవతరం-శ్రీకాకుళం**



జిల్లాలోని గ్రంథాలయాలను విజ్ఞాన నిలయాలుగా తీర్చిదిద్ది, వాటికి పూర్వవైభవం తీసుకువస్తామని జిల్లా గ్రంథాలయ సంస్థ అధ్యక్షులు పీరుకట్ల విఠల్ రావు ఆశాభావం వ్యక్తం చేశారు. బుధవారం జిల్లా కేంద్ర గ్రంథాలయ సంస్థ కార్యాలయంలో ఆయన అధ్యక్షతన నిర్వహించిన సర్వసభ్య సమావేశంలో 2026-27 సంవత్సరానికి గాను రూ. 6 కోట్ల బడ్జెట్‌కు ఆమోదించి, తదుపరి పౌర గ్రంథాలయ సంస్థ డైరెక్టర్ వారికి తదుపరి ఆమోదం కోసం పంపుతున్నట్టు ప్రకటించారు. ఈ సందర్భంగా విఠల్ రావు మాట్లాడుతూ, గ్రంథాలయానికి వచ్చే పాఠకులకు, విద్యార్థులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా కార్పొరేట్ తరహాలో వసతులు కల్పించడమే తమ ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు. పదేళ్లుగా పెండింగ్‌లో ఉన్న భవన మరమ్మతులు చేపట్టి, ఆకర్షణీయమైన రంగులతో గ్రంథాలయ రూపురేఖలు మారుస్తామన్నారు. చెదలు పట్టిన తలుపులు, పాత ఫర్నీచర్ స్థానంలో కొత్తవి ఏర్పాటు చేయడంతో పాటు, పాఠకుల సౌకర్యార్థం ఆధునిక టాయిలెట్లు, స్వచ్ఛమైన తాగునీటి కోసం ఆర్ఓ ప్లాంట్‌ను ఏర్పాటు చేస్తామని ప్రకటించారు. ముఖ్యంగా నిధుల కొరత వల్ల పెండింగ్‌లో ఉన్న జీతభత్యాలు, పెన్షన్ల సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి త్వరితగతిన పరిష్కరిస్తామని, సిబ్బంది నైతిక స్థైర్యాన్ని పెంచుతామని భరోసా ఇచ్చారు. జిల్లాలోని 44 శాఖా గ్రంథాలయాలను అభివృద్ధి పథంలో నడిపించేందుకు అధికార యంత్రాంగం పూర్తి స్థాయిలో సహకరిస్తోందని ఆయన కొనియాడారు. ఈ సమావేశంలో జిల్లా సమాచార పౌర సంబంధాల కె.చెన్నకేశవ రావు, జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి వివిజివిఎస్ శంకర్ రావు, డీఈఓ కార్యాలయ అసిస్టెంట్ కమిషనర్ చంద్రభూషణ్ రావు, వయోజన విద్య డిప్యూటీ డైరెక్టర్ ఎం.వెంకటరమణ పాల్గొన్నారు.

# కేవీకేలో వ్యవసాయాధారిత వ్యాపారాభివృద్ధిపై కిసాన్ మేళా

**నవతరం-ఆమదాలవలస**

స్థానిక కృషి విజ్ఞాన కేంద్రంలో ఫిబ్రవరి 6వ తేదీన ఆచార్య ఎన్జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలో 'వ్యవసాయాధారిత వ్యాపారాభివృద్ధి' అంశంపై కిసాన్ మేళా నిర్వహిస్తున్నట్లు కార్యక్రమ సమన్వయకర్త డాక్టర్ కె. భాగ్యలక్ష్మి తెలిపారు. ఈ కార్యక్రమానికి విశ్వవిద్యాలయ ఉపకులపతి డాక్టర్ శారదా జయలక్ష్మి దేవి ముఖ్య అతిథిగా హాజరవుతున్నారు. మేళాలో భాగంగా ఏర్పాటు చేసే వ్యవసాయ ప్రదర్శన, రైతు సదస్సు, క్షేత్ర సందర్శన వంటి కార్యక్రమాల్లో జిల్లాకు చెందిన ముఖ్య ప్రజా ప్రతినిధులు, విస్తరణ సంచాలకులు డాక్టర్ జి.శివనారాయణ, పరిశోధనా సంచాలకులు డాక్టర్ పి.వి.సత్యనారాయణ, ఐసీఏఆర్-అటారి డైరెక్టర్ డాక్టర్ షేక్ ఎన్.మీరా తదితరులు పాల్గొంటారని ఆమె పేర్కొన్నారు. జిల్లాలోని రైతులు, మహిళా రైతులు, రైతు ఉత్పత్తిదారుల సంఘాలు, ఔత్సాహిక యువత ఈ మేళాకు పెద్ద ఎత్తున హాజరై సాగులో వ్యాపార మెళకువలను తెలుసుకోవాలని కోరారు.

# పొందూరులో రూ.100 కోట్లతో ఖాదీ-ఖద్దర్ క్లస్టర్ యూనిట్

## స్థల పరిశీలన చేసిన ఎమ్మెల్యే కూన రవికుమార్

**నవతరం-ఆమదాలవలస**



ఆమదాలవలస నియోజకవర్గంలో పారిశ్రామిక అభివృద్ధికి కీలకమైన మరో కీలక అడుగు పడింది. పొందూరు మండలంలో రూ.100 కోట్ల వ్యయంతో నిర్మించబోయే ఖాదీ-ఖద్దర్ క్లస్టర్ యూనిట్ ఏర్పాటుకు సంబంధించి ఆమదాలవలస గౌరవ శాసనసభ్యులు మరియు రాష్ట్ర పియుసి చైర్మన్ శ్రీ కూన రవికుమార్ గారు ఈ రోజు స్థలాన్ని పరిశీలించారు.

ఇటీవల కాలంలో పొందూరు ఖద్దరుకు ప్రపంచ గుర్తింపు రావడంలో కూటమి ప్రభుత్వం ఎంతో కృషి చేసిందని ఎమ్మెల్యే గారు పలుమార్లు ఎంపీ గారి ద్వారా కేంద్రం దృష్టికి తీసుకెళ్లి ప్రపంచవ్యాప్తంగా పొందూరు ఖద్దరుకి గుర్తింపు రావడంలో GI ట్యాగ్ రావడం లో విశేష కృషి చేశారని తెలియజేశారు.

ఈ సందర్భంగా ఎమ్మెల్యే గారు అధికారులతో కలిసి స్థల విస్తీర్ణం, మౌలిక సదుపాయాలు, రహదారి అనుసంధానం, విద్యుత్, నీటి వసతులు తదితర అంశాలపై సమగ్రంగా సమీక్షించారు. ఖాదీ ఖద్దర్ క్లస్టర్ యూనిట్ ఏర్పాటు ద్వారా స్థానికంగా ఉపాధి అవకాశాలు పెరుగుతాయని, ముఖ్యంగా మహిళలు, కార్మికులకు , యువతకు ఉపాధి అవకాశాలు కల్పించడం ద్వారా ఇది వరంగా మారుతుందని ఆయన పేర్కొన్నారు.

ఎమ్మెల్యే గారు ఈ సందర్భంగా మాట్లాడుతూ, "పొందూరు ప్రాంతానికి చారిత్రకంగా ఖద్దర్ రంగంలో మంచి పేరు ఉంది. ఈ ప్రాంతాన్ని ఖద్దర్ రంగంలో ఆధునిక సాంకేతికతతో కలిపి అభివృద్ధి చేయడమే మా లక్ష్యం. రూ.100 కోట్లతో నిర్మించబోయే ఈ క్లస్టర్ యూనిట్ ద్వారా వేలాది మందికి ప్రత్యక్షంగా, పరోక్షంగా ఉపాధి కల్పించవచ్చు" అని తెలిపారు.

ఈ ప్రాజెక్ట్ పూర్తయితే ఖాదీ ఉత్పత్తుల తయారీ, శిక్షణ కేంద్రాలు, మార్కెటింగ్ సదుపాయాలు ఒకేచోట అందుబాటులోకి రానున్నాయని, దీంతో స్థానిక ఉత్పత్తులకు జాతీయ, అంతర్జాతీయ మార్కెట్లలో గుర్తింపు లభిస్తుందని ఆయన వివరించారు. ప్రభుత్వం పారిశ్రామికాభివృద్ధికి అత్యంత ప్రాధాన్యం ఇస్తోందని, అందులో భాగంగానే ఈ క్లస్టర్ యూనిట్ మంజూరు జరిగిందని స్పష్టం చేశారు.

స్థల పరిశీలన కార్యక్రమంలో రెవెన్యూ అధికారులు, కూటమి స్థానిక నాయకులు పాల్గొన్నారు. త్వరలోనే నిర్మాణ పనులు ప్రారంభించే దిశగా చర్యలు తీసుకుంటామని అధికారులు ఎమ్మెల్యే గారికి వివరించారు.

ఈ ఖాదీ క్లస్టర్ యూనిట్ ఏర్పాటు ద్వారా ఆమదాలవలస నియోజకవర్గం పారిశ్రామికంగా మరో మెట్టు పైకి ఎక్కనుందని స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

Printed by **SIRIGIRI VARADARAJU**, and published by **SIRIGIRI VARADARAJU**, on behalf of **SIRIGIRI VARADARAJU**, and printed at : Kranthi Publications, D.No.2-504/1, **Aditya Nagar** Colony, **Arasavilli,** Srikakulam,Srikakulam dist. ANDHRA PRADESH STATE - 532 401, **Published at :** Kranthi Publications, D.No.2-504/1, Srikakulam dist. ANDHRA PRADESH STATE - 532 401, Editor : **SIRIGIRI VARADARAJU**, Email: navataramraju@gmail.com, **Cell : 9959007255, 8340844777**